పూర్వీకల్యాణి ఆది (ఖండగతి)

అటువంటి వైభవము - లమర జేసినదైవ
మిటువంటి యోగంబు - లిన్నియును జేసె

జలజాక్షి లావణ్య - జలధి నుప్పొంగించ
నలివేణి ముఖచంద్రు - డభ్యుదయ మాయె
కలికి వలరాయడను - కాలకూటంబుతో
తలకొన్న అధరామృ - తంబు జన్మించె

వనిత సౌభాగ్యంబు - వనధిలోపలదోచె
గొనకొన్న గుఱుతైన - కుచపర్వతములు
తనివోని కోరికల - తగుతురంగములతో
ననువైన విరహబడ - బానలము గలిగె

భామయవ్వనమనెడి - పాలజలనిధిలోన
వామాక్షియైన య - వ్వన లక్ష్మిగలిగె
యీ మంచి తిరువేంక - టేశ్వరుండిందులో
ప్రేమమున సుఖియించి - పెంపొందగలిగె

ప్రబంధ కవులెందరో శృంగార వర్ణనలు చేశారు. తమతమ నాయికల శృంగార సౌందర్యాలను ఆకాశానికెత్తి వర్ణించారు. అందుకు అల్లసానిపెద్దన వరూధిని, భట్టుమూర్తి గిరికా ఉదాహరణలు. ప్రబంధ కవులు అనేక పద్యాలలో చేసిన అంగాంగ వర్ణనలన్నీ ఒక కీర్తనలోనే పక్కకునెట్టి, వైకుంఠమెక్కి, ఒక అపూర్వసౌందర్యగంగాలహరిని ఆవిష్కరించిన మహాకవి అన్నమాచార్యులు. ఈ సంకీర్తన అందుకు తార్కాణం.

ఆ దైవం అలాంటి వైభవములు అమరునట్లుగా సృష్టించాడు ఆ దైవమే యిటువంటి యోగాలు ఇన్నీ కూడా తానే ఒకరించాడు. క్షీరసాగరం మథించగా (ఆ దైవం కూర్మమై మథింపజేయగా)అందులో లక్ష్మి ఆవిర్భవించి, ఆమెయే అలమేల్మంగ అయినది. తామరలవంటి కన్నులుగల ఆమె లావణ్య సముద్రాన్ని ఉప్పొంగించడానికి చంద్రుడు (మె ముఖరూపుడై) తన చంద్రజన్మకన్న గొప్ప జన్మ అయిన అలమేల్మంగా ముఖ చంద్రుడైనాడు. స్త్రీ రూపం ధరించిన మన్మధుడనే కాలకూట విషంతోబాటు అలమేల్మంగ అధరామృతం కూడా ఇమ్మడిగా ఉద్భవించింది. (ఐహిక సుఖాలతో శరీరం శిథిలమౌతుంది గనుక మన్మధుడు విషతుల్యుడని భావన. ఐహిక విషయవిషాల చేదెరిగిన అన్నమయ్య ఆ తల్లి అమృతమయమైన ముద్దుల రుచికూడా యెరుగును.)

అలమేల్మంగ సౌభాగ్యం అపారమైనది, అనంతమైనది. మహాజలధివంటి ఆమె సౌభాగ్యం (మంగళసూత్రం) లోపల (వెనుక) శాత చూచుక శిఖర సంయుతమైన ఆమె స్తన పర్వతాలు దోబూచులాడినవి (అలమేల్మంగా స్తనంథయుడు అన్నమాచార్యులు కాని పక్షంలో ఇంత అందం ఇంత మాధుర్యం అన్నమయ్య పదాలలో వచ్చే అవకాశం లేదు). మైనాకాది పర్వత పంక్తులు ఇంద్రుడికి వెరచి సాగరంలో దాగిన విషయం పురాణ గ్రథితం. తనివి తీరని కోరికలు అనే ఉచ్చైశ్రవాలు - జాతి అశ్వాలతోబాటు అలమేల్మంగా సౌందర్యమహా సాగరంలో విరహ బడబానలం (సముద్రంలో ఉండే అగ్ని) కలిగినది. బడబ అంటే అదు గుఱ్ఱం. బడబకు కల్గే విరహతాపం బడబానలము అని చమత్కరిస్తున్నారు.

అలమేల్మంగ యౌవనం అనే క్షీరవారాశిలో అలమేల్మంగా స్వరూపం అయిన ఆమె యవ్వన లక్ష్మి కలిగినది. పోల్చడానికి, పోల్చబడటానికీ ఉపమలు లేని కారణంగా అలమేల్మంగ తనరూపమూ, తన సౌందర్య రూపంకూడా తానే ధరించింది. అనుపమ అయిన ఆమెనూ, అనుపమానమైన ఆమె సౌందర్యాన్నీ ఉపమించాలంటే ఆ అందాల అలమేల్మంగ రెండు రూపాలు ధరించవలసినదే తప్ప వేరే మార్గం లేదుట. ఇన్ని యేర్పాట్లు ఇలా జరిగాయి గనుకే మా తిరువేంకటేశ్వరుడు ఇందులో, ఈ సౌందర్య లావణ్య క్షీరసాగరంలో ప్రేమలలో శయనించి సుఖించవీలైంది. ఇది అంతా ఆ క్షీరజలధి శయనుడైన దైవమే ఒనరించాడు. ఆ దైవమే ఆ క్షీరాబ్ధిలో శయనించి సుఖించాడు. భోజ్యమూ, భోక్తాకూడా ఆ స్వామియైనాడని అన్నమాచార్యుల అనన్వయాలంకార చర్చ.